

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-185-

(26 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

ఈ సంవత్సరం విజయవాడలో వడగాడ్పులకు తోడు మంచినీటి ఎద్దడి కూడా సంభవించింది. వేసవిలో ప్రశాంతి కల్పించేది మంచినీళ్ళు, మలయ మారుతమేగదా!

మలయ పవనుడు ఎప్పుడొస్తాడో ఏమో తెలియదు. దయవున్న రోజున రాత్రిపూట అప్పుడప్పుడు చిన్నిచిన్ని షికార్లు చేసిపోతూ వచ్చాడు. అదైనా అందరికీ అందుబాటులో వుంటే చాలు. చాలామంది ఇళ్ళలోనే ఫానుల క్రింద కూరుకుపోతారు.

బయట పరుండటమంటే దొంగల భయం, వడగాడ్పుల భయం.. "ఎందుకొచ్చింది మహానుభావా!" అంటూ తలుపులు వేసుకుని వెచ్చటి ఫాన్ క్రిందచేరి "అయ్యో మంటలు.. అయ్యో వేడి" అని నానా అవస్థాపడటం.

తెల్లారి తలుపు తీస్తే మళ్ళీ సూర్యభగవానుని వంతు. ఆయన రంగంలోకి ఉరికి నరులను నానా కష్టాలూ పెట్టడం. చాలామంది అంటూ వచ్చారు "మరేం లేదు రోహిణి ముందుకు వచ్చింది. అప్పటికి దేశం చల్లబడిపోతుంది. అందాకా ఇలా వుంటే ఇంకేం వుంది?" అని.

ముందుకు ఎలా వస్తుందండీ.. ఇంకా పెరిగిందంటే నమ్మవచ్చుగాని, పదిహేను రోజుల కార్తె నెల అయింది. అంతేగాని, రోహిణిలో మృగశిర వచ్చి కలుస్తుందనుకోవడం కల్ల" అని కొందరి వ్యాఖ్యానం.

ఏది ఎలా వున్నా ముందుగానే బెజవాడలో మంచినీటి సరఫరా తగ్గిపోయింది. ఇంకా చెప్పారు తిప్పలు. పంపులు జలపాతాలలాగా వచ్చి పడుతుంటేనే దిక్కులేని కాలంలో పంపులు పలకరించినా పలకకుండా, మొరపెట్టినా వినకుండా ఉక్కు ఉక్కుగానే వుండిపోతే, నాలికలు తడిసేదెలా, నరులు బ్రతికేదెలా?

ఏదైనా వస్తువు లేదన్నప్పుడు దాని మీద మక్కువ ఎక్కువ కావడం మామూలు పంపుల్లో నీళ్ళు రావడం లేదన్నప్పుడే దాహాలు పదింతలు, పాతిక యింతలూ అయిపోవడం సంభవిస్తుంది.

ప్రతి పొట్టకూ నాలుగు కూజాల నీళ్ళు బొటాబొటీగా సరిపోతూ వచ్చాయి. ఎవరన్నా మాట్లాడుతున్నా, ఏదైనా పనిచేస్తున్నా ఒకచేత్తో గ్లాసు వుండక తప్పడం లేదు. కాసిని కాసిని చప్పరిస్తూ, ఒక్కొక్క ముక్కే చెప్పడం జరుగుతూ వచ్చింది.

ఉదాహరణకు చెపుతాను. ఈ గాడ్పుల రోజుల్లో ఒకరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఎక్కడో దూరం నుంచి ఒక పత్రికా ప్రతినిధి వచ్చాడు. ఆయనగారు ఎన్నో ప్రశ్నలు వేయడం ప్రారంభించారు.

"ఎలాటి వ్యాసాలు వేస్తే పత్రిక బాగా అమ్ముడు పోతుందండీ?"

"ప్రసిద్ధులైన వాళ్ళ రచనలు.. అంటే కొందరికి మార్కెట్ వాల్యూ ఎక్కువ వుంది. వారి రచనలే తీసుకోవాలి."

"కాసిని మంచినీళ్ళు ఇప్పిస్తారా?"

"ఆ.. తీసుకోండి"

మంచినీళ్ళు గడగడ త్రాగి

"అలాంటివారి పేర్లు కొన్ని చెపుతారా.. "

"అందరికీ తెలిసినవే.. చెప్పాలంటే పెద్ద జాబితా అవుతుంది. "

"పోనీ వ్రాసి పంపుతారా!"

"అలాగే."

"కాసిని మంచినీళ్ళు?...."

"అలాగే"

మంచినీళ్ళు త్రాగి "మీకు మంచి నీళ్ళు బాగా దొరుకుతున్నాయా.? "

"బాగానా అసలు దొరకడం కష్టంగా వుంది. బిందెలు పుచ్చుకుని ప్రొద్దున్నే ఊరివెంట బయలుదేరుతున్నాం. మేళం లేదుగాని ప్రతిరోజూ ఈ బిందె తీర్థం ఊరేగింపు తప్పడంలేదు. "

"అలాగా చాలా నీళ్ళు నేనే త్రాగేస్తున్నానే. "

"నేనూ త్రాగుతున్నాలెండి. డబ్బా దాహం, నీటి దాహం వగైరాలు తర్వాత తర్వాత ఎలా అనే విషయం ఆలోచించనివ్వవులెండి" అన్నాను.

"అయితే రేపు వస్తాను. ఈ పూటకు వెడతాను. కాసిని నీళ్ళు త్రాగి వెడతాను."

"అలాగే తీసుకోండి. "

ఆయనగారు వెళ్ళారు. మాట్లాడింది అయిదు మాటలు. త్రాగింది పది గ్లాసుల మంచినీళ్ళు. ఆయన వెళ్ళిన తర్వాత నాకు బెంగపుట్టి నాలుగు గ్లాసుల నీళ్ళు త్రాగాను. ఒకటి ద్రాక్షపళ్ళు నానవేసిన గ్లాసు, ఒకటి సబ్జా గింజలు వేసింది. ఒకటి కర్పూరకాయ ముక్కలు వేసిన గ్లాసు. చివరికి పటికబెల్లం పొడి వేసిన నీళ్ళు.

అయిదేసి నిముషాల గడువుతో అయిదు గ్లాసుల పానీయాలు స్వీకరించి "పంపునీళ్ళు.. ప్రజల సాధక బాధకాలు" అనే విషయం మీద ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఒకరోజు నేనూ, ఒక మిత్రుడూ బజారు వెడుతున్నాం. మరో మిత్రుడు ఎదురయ్యాడు. నాతోవున్న మిత్రుడన్నాడు "చకచక నడవండి. ఆ సోడా షాపు దగ్గరైనా నుంచుందాం. నాలిక పిడచ కట్టుకుపోయి మనం పడిపోయినా, వాడు వదిలిపెట్టడు. అంత ఆత్మత్యాగం మనమెక్కడ చేస్తాం. వాడి గ్యాస్ వింటూ, ఆ గ్యాస్ నీళ్ళు త్రాగుతూ వుండవచ్చు" అని.

నిజానికి అంతపనీ జరిగింది. అతగాడేదో సంసార విషయం తీసుకొచ్చి సానుభూతి వర్షం కురిపించి, మళ్ళీ మేమే తల తుడిచి వీపు తట్టి పంపేదాకా వదలలేదు. మొత్త ఆ సమావేశానికి ఎనిమిది సోడాలు గావన్ను అయినాయి.

నిజానికి నాలికల్ని కాపాడుకోవడం చాలా కష్టంగా వుంది ఎండల్లో. "ఆలీ, నాలుకా అదుపులో వుంటే జీవితాన్ని జయించినట్లే" అని పెద్దలు చెప్పిన సామెత వుంది. దానితోపాటు "వీటి రెంటినీ పోషించుకోవడం కూడా గొప్పే." మామూలుగా అయితే నాలికదేం కష్టం అనుకునే వాళ్ళం. నీటి ఎద్దడిలో అదీ పరమ కష్టంగా తయారైంది. పైగా ఆలస్యం చేస్తే ప్రమాదంగా కూడా తయారవుతోంది.

సంఘంలో ఒకరి అవసరాలు ఒకరు గుర్తించడం గొప్ప విషయంగా చెపుతూ వుంటారు. అవయవాల విషయంలో కూడా అంతే. మరి నాలిక అవసరం, ఆదుర్దా కడుపు తెలుసుకుని, ఎడ్జెస్టు చేసుకుంటుందా!

మర్యాదకు కొంచెం సేపు ఊరుకుంటుంది. తర్వాత ఎదురు తిరుగుతుంది. నీటికి సామరస్యం కుదర్చడం ఒక పెద్ద సమస్య వేసవిలో.

Post your comments